

ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..





కోవూరు..	సర్వేపల్లి..
జగనన్న అమ్మఒడి రూ.37.05 కోట్లు	జగనన్న అమ్మఒడి రూ.119.05 కోట్లు



కోవూరు..	సర్వేపల్లి..
వైఎస్సార్ రైతు భరోసా రూ.28.87 కోట్లు	వైఎస్సార్ రైతు భరోసా రూ.105.87 కోట్లు



కోవూరు..	సర్వేపల్లి..
సున్నావడ్డీ పంట రుణాలు రూ.89.26 కోట్లు	సున్నావడ్డీ పంటరుణాలు రూ.33.26 కోట్లు



కోవూరు..	సర్వేపల్లి..
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.2.20 కోట్లు	రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.1.10 కోట్లు



కోవూరు..	సర్వేపల్లి..
మహిళలకు సున్నావడ్డీ రూ.41.89 కోట్లు	మహిళలకు సున్నావడ్డీ రూ.29.89 కోట్లు



కోవూరు..	సర్వేపల్లి..
మహిళలకు చేయూత రూ.100.27 కోట్లు	మహిళలకు చేయూత రూ.107.37 కోట్లు



కోవూరు..	సర్వేపల్లి..
మహిళలకు వైఎస్సార్ ఆసరా రూ.183.07 కోట్లు	మహిళలకు వైఎస్సార్ ఆసరా రూ.92.01 కోట్లు



కోవూరు..	సర్వేపల్లి..
జగనన్న విద్యాదీవెన రూ.44.93 కోట్లు	జగనన్న విద్యాదీవెన రూ.50.34 కోట్లు

నాడు సంక్షేమ సంతకం
నేడు అంతా మోసం

సూపర్ సిక్స్ అమలులో బాబు యూటర్న్

- ఇచ్చిన హామీల అమలుకు ప్రజల డిమాండ్
- పగ్గాలు చేపట్టి 100 రోజులు అవుతున్నా పథకాల ఊసేలేదు



బాబు సూపర్ 6

నాడు

రైతులకు వ్యవసాయ సీజన్ మొదలు కాగానే వైఎస్సార్ రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయంతో పాటు సున్నా వడ్డీ కింద పంట రుణాల మంజూరు జరిగేవి. అంతేకాకుండా సబ్సిడీపై ఎరువులు, విత్తనాలను అందజేయడం, పంట చేతికొచ్చాక కొనుగోలు చేయడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే పరిహారం అందేవి. అదేవిధంగా పాఠశాలలు పునః ప్రారంభం కాగానే తల్లి ఖాతాలో అమ్మఒడి పథకం కింద నగదు సాయం అందేది. ఇది పిల్లల స్కూల్ ఫీజులకు ఎంతగానో దోహదం చేసేది. మహిళా సాధికారత దిశగా వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి అనేక పథకాల ద్వారా వారి ఆర్థికాభివృద్ధికి బాటలు పడ్డాయి. దీంతో పాటు చేనేత నేస్తం, కాపు నేస్తం వంటి పలు సంక్షేమ పథకాలు అన్నివర్గాల ప్రజలకు ఠంచన్‌గా అందేవి.

నేడు

వ్యవసాయానికి పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు వస్తుందని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలింది. చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం వస్తుందని ఆశించిన తల్లిదండ్రులకు ఏమరపాటే ఎదురవుతోంది. నిరుద్యోగులకు ఉపాధి కల్పన లేదా భృతి వస్తుందని వేచి ఉన్న యువతకు ఎదురుచూపులే మిగిలేలా ఉంది. ప్రతినెలా రూ.1,500 వస్తుందని కోటి ఆశలతో ఉన్న మహిళలందరికీ వెన్నుపోటే మిగిలేలా ఉంది. ఇలా ఎన్నికల ప్రచారంలో అధికారమే పరమావధిగా ఆచరణకు నోచుకోని సంక్షేమ పథకాలను ఊదరగొట్టారు. అధికారంలో వచ్చిన తరువాత అసెంబ్లీ సాక్షిగా అటు చంద్రబాబు.. ఇటు లోకేశ్ సూపర్ సిక్స్ పథకాల అమలు కష్టమే అన్నట్లుగా చెప్పడం లబ్ధిదారుల్లో తీవ్ర నిరాశ కలిగించింది.

అన్నదాత సుఖీభవ (ఏడాదికి)



కోవూరులో..	సర్వేపల్లిలో..
అర్హులు : 19,541 మంది	అర్హులు : 30,242 మంది
అందాల్సిన సాయం రూ.39.08 కోట్లు	అందాల్సిన సాయం రూ.60,48,40,000

తల్లికి వందనం



కోవూరు నియోజకవర్గంలో..	సర్వేపల్లి ..
అర్హులు : 18,732 మంది	అర్హులు: 29,205 మంది
ఏడాదికి అందాల్సిన సాయం రూ.28.09 కోట్లు	ఏడాదికి అందాల్సిన సాయం రూ.43.80 కోట్లు

ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి



కోవూరులో..	సర్వేపల్లిలో..
అర్హులు: 98,765 మంది	అర్హులు: 91,556 మంది
నెలకు ఇవ్వాల్సిన సాయం రూ.29.62 కోట్లు	వీరికి నెలకు ఇవ్వాల్సిన సాయం రూ.27.46 కోట్లు

ప్రతి మహిళకు నెలకు రూ.1,500



కోవూరులో..	సర్వేపల్లిలో..
అర్హులు: 1,28,435 మంది	అర్హులు: 83,612 మంది
నెలకు ఇవ్వాల్సిన సాయం రూ.19.26 కోట్లు	నెలకు ఇవ్వాల్సిన సాయం రూ.12.54 కోట్లు

పంట సాగుకు పెట్టుబడి ఇచ్చేదెప్పుడు



గతంలో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఈ పాటికే రైతు భరోసాను అర్హత కలిగిన రైతులందరికీ ఇచ్చారు. ప్రతి సంవత్సరం చెప్పిన సమయానికల్లా రైతు భరోసా నగదును ఇవ్వడంతో రైతులు సంతోషంగా పంటలు పండించుకున్నారు. టీడీపీ నేతలు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఆ ఊసే ఎత్తలేదు. రైతులందరూ ఆందోళనతో ఎదురు చూస్తున్నారు.

– శివకుమార్‌రెడ్డి, ఇస్కపాళెం, వెంకటాచలం మండలం

భృతి ఇవ్వాల్సిందే



సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో చదువుకున్న యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తానని, లేదంటే నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు సమీపిస్తున్నా ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతిపై మాట్లాడడం లేదు. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతిని అమలు చేయాలి.

– డి.హరీంద్ర, నిరుద్యోగి, విడవలూరు

అన్నదాత సుఖీభవ ఇంకెప్పుడో



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా రైతులకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయంగా అందిస్తారన్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్నాం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీజన్ ముందే రైతు భరోసా అందుతుండేది. కానీ ఈ కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు పూర్తవుతున్నా అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం గురించి అతీగతీ లేదు.

– కోటా శేఖర్‌రెడ్డి, రైతు, వరిగొండ, తోటపల్లిగూడూరు మండలం

20 లక్షల ఉద్యోగాలెక్కడ



టీడీపీ అధికారంలోకి రాగానే యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలో ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. ఈ హామీ అమలు చేయడానికి ఎన్నిరోజులు పడుతుందో తెలియడం లేదు. ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– కె.దేవిక, వావిలేటిపాడు

తల్లికి వందనం ఊసేలేదు



సెప్టెంబర్ మాసం ముగుస్తున్నా తల్లికి వందనంపై కూటమి ప్రభుత్వం ఊసెత్తడం లేదు. స్వయంగా విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఈ ఏడాది తల్లికి వందనం అందజేయలేమని చెప్పడం బాధాకరం. మా ఇద్దరు పిల్లలు చదువుకుంటున్నారు. వారి ఫీజులకు తల్లికి వందనం నగదు ఉపయోగపడుతుందని ఆశపడ్డాం. గతంలో జగన్ ఠంచన్‌గా అమ్మఒడి నగదును బ్యాంకులో జమ చేశారు.

– వై.పద్మజా, మొగళ్లూరు, పొదలకూరు మండలం

ఉచిత బస్సు వట్టిదేనా?



కూటమి అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. దీంతో ఎంతో సంతోషించి కూటమికి ఓట్లు వేశాం. కానీ మూడు నెలలు పూర్తయినా ఉచిత బస్సు ఊసే లేదు. ఓట్ల కోసం బూటకపు హామీలిచ్చి వదిలేశారన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఉచిత బస్సు విషయంలో స్పష్టత రావాలి. ఎన్నికలకు ముందు ఇష్టానుసారం హామీలిచ్చి మిన్నకుండిపోవడం మోసం చేయడమే. దీనిపై వెంటనే చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేయాలి.

– పానేటి సంధ్యారాణి, గృహిణి, నార్తురాజుపాళెం, కొడవలూరు

ఇచ్చిన హామీలను పూర్తిగా మరిచారు



ఓట్ల కోసం కూటమి నేతలు హామీలు గుప్పించారు. ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని టీడీపీ హామీ ఇచ్చింది. ఈ విషయంపై కూటమి నేతలంతా ముమ్మర ప్రచారం చేసి లబ్ధి పొందారు. కానీ అధికారంలోకి వచ్చాక పాలకులు మూడు సిలిండర్ల మాటే మర్చిపోయారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే మూడు గ్యాస్ సిలిండర్లను అందజేయాలి.

– ఎండ్లూరు అంజి, పెయింటర్, రావూరి వారికండ్రిగ, తోటపల్లిగూడూరు మండలం

రైతుకు సాయమేదీ



రైతులకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి తొలివిడత అన్నదాత సుఖీభవ సాయం అందనే లేదు. ఖరీఫ్ గడిచిపోయిన తర్వాత కూడా సాయం అందుతుందన్న నమ్మకం సన్నగిల్లుతోంది. సీఎం చంద్రబాబు మాటతీరు చూస్తుంటే రైతులకు సాయం అందించేలా లేరు. గతంలో వైఎస్ జగన్ రైతుభరోసా పేరుతో మే నెలలోనే సాయం అందజేసేవారు.

– జి.నారాయణరెడ్డి, పులికల్లు, పొదలకూరు మండలం

నెలకు రూ.1,500 ఎప్పుడిస్తారో



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సూపర్ సిక్స్ పథకాల మాటే లేదు. ఎన్నికల్లో మహిళా ఓట్లను ఆకర్షించేందుకు పథకాలను గుప్పించారు. ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులంటూ దాటవేసేందుకు చూస్తున్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500 ఎప్పుడిస్తారో చెప్పడం లేదు. గత ప్రభుత్వంలో జగన్ ఎన్నో పథకాలు ప్రకటించి పక్కాగా అమలు చేశారు.

– ఎం.విజయ, సీఎం కాలనీ, మనుబోలు

నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి



చదువుకుని ఖాళీగా ఉన్న యువకులకు ప్రభుత్వం నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు అందజేయాలి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు భృతిపై స్పష్టమైన విధివిధానాలను ప్రకటించలేదు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారు. అమలు చేయలేని వాటిని జగనన్న చెప్పలేదు. భృతి భ్రాంతిగా మిగులుతుందనే భయం ఉంది.

– కె.సుకుమార్‌రెడ్డి, నిరుద్యోగి, మనుబోలు

రూ.1,500 వెంటనే ఇవ్వాలి



టీడీపీ కూటమి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడుస్తోంది. ఇప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం న్యాయం కాదు. వెంటనే తమకు రూ.1500 ఇవ్వాలి.

– కె.కామేశ్వరమ్మ, కోవూరు

అన్ని హామీలు అబద్ధాలు



చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల్లో కూడా అబద్ధపు హామీలు ఇచ్చి గెలుపొందారు. 2024 ఎన్నికల్లో కూడా సూపర్ సిక్స్ అంటూ అబద్ధపు హామీలు ఇచ్చారు. ప్రజలు దీనికి ఆకర్షితులై ఓట్లు వేసి గెలిపించారు. అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ అమలు చేయలేక చేతులెత్తే పరిస్థితి ఏర్పడింది. ప్రజలు మరోసారి మోసపోయారు.

– గవిని రంగనాథ్, మల్లూరు, ముత్తుకూరు మండలం

అన్నదాత సుఖీభవ ఊసే లేదు



గత ప్రభుత్వంలో రైతు భరోసా కింద రూ.13.500 ఇచ్చేవారు. ముందుగా ప్రకటించిన తేదీల ప్రకారం చెల్లిస్తుండడంతో వ్యవసాయ ఖర్చులకు ఉపకరించేవి. కూటమి అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామన్నారు. ఈ మాటలు నమ్మి ఓట్లు వేశాం. కూటమి అధికారంలోకి వచ్చి మూడు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. గత ప్రభుత్వంలో ఇప్పటికే చెల్లించేవారు. అసలు ఇస్తారా ఇవ్వరా కూడా స్పష్టత లేకుండా ఉంది. రైతులకు బూటకపు హామీలిచ్చి నట్టేట ముంచేశారన్న అనుమానం రేకెత్తుతోంది. అన్నదాత సుఖీభవ ఎప్పుడు ఇస్తారో వెంటనే ప్రకటించాలి.

– ఉప్పాల జనార్దన్, రైతు, నాయుడుపాళెం, కొడవలూరు మండలం

తల్లికి వందనం అడియాశలేనా



నా ఇద్దరు పిల్లలు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. పాప ఏడు, బాబు తొమ్మిదో తరగతి చదువుతున్నారు. వీరికి ఫీజులు చెల్లించడం మధ్య తరగతికి చెందిన మాకు పెనుభారంగా ఉంది. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఎంత మంది పిల్లలుంటే అంతమందికి రూ.15 వేల వంతున ఇస్తానని చెప్పడంతో ఫీజుల భారం తగ్గుతుందని నమ్మి ఓట్లు వేశాం. తీరా ఎన్నికలు పూర్తై కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఏడాదికి తల్లికి వందనం లేదని పరోక్షంగా సంకేతాలిస్తున్నారు. వారి మాటలు వింటుంటే మా ఆశ అడియాశగా మారేలా ఉంది. అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. చంద్రబాబు హామీలను నమ్మడం వల్లే మాకు ఈ దుస్థితి నెలకొంది.

– డి.సంపూర్ణ, విద్యార్థుల తల్లి, నార్తురాజుపాళెం, కొడవలూరు

క్లుప్తంగా

170 మందికి కేన్సర్ పరీక్షలు

కొడవలూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొడవలూరు, రేగడిచెలిక, గుండాలమ్మపాళెం, బసవాయపాళెనికి చెందిన 170 మందికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను బుధవారం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడారు. మండలంలో ఆరు రోజుల పాటు పింక్ వెహికల్ అందుబాటులో ఉంటుందన్నారు.

గడ్డివామి దగ్ధం

వెంకటాచలం : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివామి దగ్ధమైన ఘటన వెంకటాచలంలో బుధవారం జరిగింది. వెంకటాచలానికి చెందిన రైల్వే రిటైర్డ్ ఉద్యోగి ఎద్దు ప్రసాద్ తన ఇంటి సమీపంలో గడ్డివామి వేసుకుని ఉండగా, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గడ్డివామికి మంటలు వ్యాపించి కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించినా, వారు చేరుకునే సరికి గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. దీనివల్ల రూ.50 వేలు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

మహిళపై దాడి

పొదలకూరు : మండలంలోని నల్లపాళెం గ్రామంలో భార్యభర్తలు కలిసి ఓ మహిళపై దాడికి పాల్పడడంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన దేవిపై ఇంటి పక్కనే ఉన్న నారాయణరెడ్డి, పుష్ప దంపతులు పాతకక్షలను మనస్సులో పెట్టుకుని దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

వెంకటాచలం : విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యమని వీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-4 ప్రోగ్రామ్ అధికారి బీవీ సుబ్బారెడ్డి అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, సోషల్ వర్క్ విద్యార్థులు పరిసరాలను పరిశుభ్ర పరిచారు. కళాశాలలోని క్యాంటిన్, ఇతర ప్రాంతాల్లోని పిచ్చి మొక్కలను తొలగించారు.

- **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** బుచ్చి పట్టణంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలను నాటారు. సీఐ శ్రీనివాసరెడ్డి, సీహెచ్‌సీ పద్మజ పాల్గొన్నారు.



స్వచ్ఛత హీ సేవలో పాల్గొన్న విద్యార్థులు

- **పొదలకూరు :** మండలంలోని విరువూరు ఎంపీపీ మెయిన్ స్కూల్ ఆవరణలో అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. సర్పంచ్ జగన్‌మోహన్, ఇరిగేషన్ ఏఈ రవికుమార్‌రెడ్డి, సెక్రటరీ వసుధరాణి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మలిదేవి కాలువ వద్ద తాగునీటి పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో నగర పంచాయతీ పరిధిలో గురువారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని కమిషనర్ చంద్రశేఖరరెడ్డి బుధవారం తెలిపారు. గాంధీనగర్, కోదండరామాపురం, రామకృష్ణనగర్, రాఘవరెడ్డికాలనీ, కాశీపాళెం, సావిడి, పెద్దూరుమంగళపాళెం ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు.

ఎస్సైల బాధ్యతల స్వీకరణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా సంతోష్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం సీఐ శ్రీనివాసరెడ్డిని కలిసి పూల మొక్కను అందించారు.

- **విడవలూరు :** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్సైగా పి.నరేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న సాయిప్రసాద్ ఆత్మకూరుకు బదిలీ అయ్యారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మనుబోలు : మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. మనుబోలు, వీరంపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీలు రమణమ్మ, సుగుణమ్మ, విజయమ్మ, సుజన, నిర్మల, శ్రీదేవి, జ్యోతిర్మయి, మాధవి పాల్గొన్నారు.

- **పొదలకూరు :** పట్టణంలోని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవం జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ ఆరు నెలలు నిండిన పిల్లలకు పౌష్టికాహారం అందజేయాలని తెలిపారు. సమావేశంలో ఏఎన్‌ఎం హైమావతి, అశ్విని, ఎంఎల్‌హెచ్‌బీ చందన, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.
- **కొడవలూరు :** యల్లాయపాళెం మజరా రెడ్డిగుంటలో పోషక విలువలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి, వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం విఫలం

ముత్తుకూరు : ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య ధ్వజమెత్తారు. ముత్తుకూరు పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన నియోజకవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. స్థానిక టీడీపీ నేతలు చిరుద్యోగులపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారన్నారు. నీటిపారుదల శాఖలో లస్కర్లు లేకపోవడం వల్ల 300 టీఎంసీల నీరు సముద్రం పాలైందన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షాన్‌వాజ్, నియోజకవర్గ కార్యదర్శి నందయ్య, మండల కార్యదర్శి తుంగాఏడుకొండలు పాల్గొన్నారు.

క్రీడాకారుల ఎంపిక నేడు

పొదలకూరు : మండలంలోని మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీహైస్కూల్లో గురు, శుక్రవారాల్లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని హెచ్‌ఎం రామకృష్ణయ్య, ఎస్‌జీఎఫ్ కో-ఆర్డినేటర్ విజయవిశ్వేశ్వరన్ బుధవారం తెలిపారు. తొలిరోజు అథ్లెటిక్స్‌లో అండర్-14, అండర్-17 బాలురు, బాలికల ఎంపిక ఉంటాయన్నారు.

- **కోవూరు :** మండలంలోని పాటూరు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయని ఎంఈఓ రహీమ్, హెచ్‌ఎం జి.వెంకటేశ్వర్లు తెలియజేశారు.

విశ్వనాథునికి రుద్రాభిషేకం

మనుబోలు : మనుబోలు- చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో బుధవారం రాత్రి పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. కోవూరు సుధీర్, సారిక దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేలటూరుపాళెంలో పశువైద్య శిబిరం



ముత్తుకూరు : మండలంలోని నేలటూరు పట్టపుపాళెంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. హీపర్ ఇంటర్నేషనల్-ఎస్‌ఈఐఎల్ ఇండియా సహకారంతో నిర్వహించిన శిబిరంలో పశువులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఉచితంగా మినరల్ మిక్చర్, నట్టల నివారణ మందులు అందజేశారు. వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్ నిర్మల, పశువైద్యులు గోవర్ధన్, రాజ్యలక్ష్మి, సరిత, శివశంకర్‌రెడ్డి, 48 మంది రైతులు పాల్గొన్నారు. ఎస్‌ఈఐఎల్ ప్రతినిధులు నాగేశ్వరావు, రూపేష్, మూర్తి, హీపర్ ప్రతినిధులు శ్యామ్ కట్ట, గణేష్, లోక్‌నాథ్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

విడవలూరు : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పి.వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు తనను జగనన్న ఆప్యాయంగా పలకరించినట్లు తెలియజేశారు.

తిరుమలకు పాదయాత్ర

పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి తిరుమలకు సుమారు 100 మంది భక్తులు బుధవారం పాదయాత్రగా బయలుదేరారు. ముందుగా దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎలాంటి విఘ్నాలు లేకుండా పాదయాత్ర సాగాలని మొక్కుకున్నారు.

షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు

కోవూరు : మండలంలోని పాటూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో షూటింగ్ బాల్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్స్ బాల బాలికల జిల్లా జట్ల ఎంపిక బుధవారం జరిగింది. వీరు అక్టోబర్ 6, 7వ తేదీల్లో కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భీమతాటి వెంకటరమణయ్య తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వెంకటేష్, స్థానిక నాయకులు శివారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భరత్, టీవీ సురేష్, చెన్నారాయుడు, ప్రవీణ్ పాల్గొన్నారు.

గీతాంజలి విద్యార్థుల ప్రతిభ



కోవూరు : కావలి విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా గీతాంజలి కళాశాల ప్రాంగణంలో ప్రతిభ చూపిన విద్యార్థులను బుధవారం అభినందించారు. కార్యక్రమంలో సెక్రటరీ ఎన్.సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ కె.సందీప్‌కుమార్, డైరెక్టర్ సుబ్బారావు, పీడీ అశోక్ కుమార్, ఇతర విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.